


గర్భిణుల వైద్యసేవలపై డీఎంహెచ్‌వో ఆరా

పాలకొండ: గర్భిణులకు అందిస్తున్న వైద్య సేవలపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి బి.జగన్నాథరావు ఆరా తీశారు. ఈ మేరకు శుక్రవారం ఎం.సింగుపురం, వీరఘట్టం మండలం బిటివాడలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీఎంఎస్‌ఎంఏ కార్యక్రమంలో భాగంగా ఆయా చోట్ల గర్భిణులకు చేపడుతున్న వైద్య తనిఖీలు, రికార్డులను పరిశీలించారు. ప్రిజం అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రిజం-10పై గర్భిణులు, బాలింతలు, బాలికలకు అవగాహన పెంపొందించాలని సిబ్బందికి సూచించారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం పనికి రాదని, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

ఇంటర్‌లో జిల్లాకు 11వ స్థానం



- ఫస్టియర్‌లో 65, సెకండియర్‌లో 77 శాతం ఉత్తీర్ణత
- ఒకేషనల్ కోర్సుల్లో ప్రథమ స్థానం

పార్వతీపురం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫలితాల్లో జిల్లాకు రాష్ట్రస్థాయిలో 11వ స్థానం లభించింది. ఇంటర్ జనరల్ కోర్సుల్లో జిల్లా నుంచి 5,475 మంది ప్రథమ సంవత్సరంలో పరీక్షలు రాయగా 3,565 మంది ఉత్తీర్ణత సాధించారు. రెండో సంవత్సరంలో 5,292 మంది పరీక్షలు రాయగా 4054 మంది పాసయ్యారు. ప్రథమ సంవత్సరంలో 65శాతం, ద్వితీయ సంవత్సరంలో 77శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇక ఇంటర్మీడియట్ ఒకేషనల్ కోర్సు పరీక్షల ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు సంబంధించి రాష్ట్రంలోనే జిల్లాకు ప్రథమ స్థానం లభించింది.

జిల్లాలో ఇలా..

జిల్లాలోని 14 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వాటిల్లో జనరల్ మొదటి సంవత్సరంలో 1761 మంది పరీక్షలు రాయగా 934 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం జనరల్ కోర్సులకు సంబంధించి 1,717 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 1,169 మంది పాసయ్యారు. మొదటి సవత్సరం ఒకేషనల్ కోర్సులకు సంబంధించి 737 మంది హాజరుకాగా 52 మంది, రెండో సంవత్సరంలో 618 మంది విద్యార్థులకు గాను 488 మంది ఉత్తీర్ణత సాధించారు. మొత్తంగా ఒకేషనల్ కోర్సుల ఫలితాల్లో జిల్లాకు రాష్ట్రంలోనే ప్రథమ స్థానం లభించింది.

- ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 96 శాతం ఉత్తీర్ణతతో కొమరాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రథమ స్థానంలో ఉంది. 93 శాతం ఉత్తీర్ణతతో మక్కువ ప్రభుత్వ జూనియర్ కళాశాల ద్వితీయ స్థానంలో నిలిచింది.
- ద్వితీయ సంవత్సరం ఇంటర్ ఫలితాల్లో 98 శాతంతో కొమరాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రథమస్థానంలో, మక్కువ జూనియర్‌కళాశాల 95 శాతం ఉత్తీర్ణతతో ద్వితీయ స్థానంలో నిలిచాయి.
- జిల్లాలో ఉన్న సోషల్ వెల్ఫేర్ కళాశాలలకు సంబంధించి కొమరాడ, గరుగుబిల్లిలో ప్రథమ, ద్వితీయ సంవత్సరాల విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించారు.
- కేజీబీవీ విభాగంలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో మక్కువ, గరుగుబిల్లి కళాశాలల విద్యార్థినులు, ద్వితీయ సంవత్సరంలో మక్కువ, గరుగుబిల్లి, జోగింపేట, కురుపాం, చినమేరంగి కళాశాలల విద్యార్థినులు శతశాతం ఉత్తీర్ణత సాధించారు.

పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో..

పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో జోగింపేట ఎస్‌వోయూ కళాశాల, భద్రగిరి, పి.కోనవలస, కురుపాం బాలికల కళాశాలలతో పాటు భద్రగిరి, పి.కోనవలస బాలుర గురుకుల కళాశాల నుంచి 660 మంది ప్రథమ సంవత్సరంలో పరీక్షలు రాయగా 605 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 589 మంది పరీక్షలు రాయగా 543 మంది ఉత్తీర్ణత సాధించారు.

కొన్ని కళాశాలల్లో ఇలా..



జిల్లాలోని కొన్ని ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఫలితాలు దారుణంగా ఉన్నాయి.

- పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 203 మంది ప్రథమ సంవత్సరంలో పరీక్షలు రాయగా కేవలం 44 మంది మాత్రమే పాసయ్యారు.
- సాలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 180 మంది పరీక్షలు రాయగా ప్రథమ సంవత్సరంలో 50 మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు.
- పాలకొండ జూనియర్ కళాశాలలో 118 మందికి గాను మొదటి సంవత్సరంలో కేవలం 30 మంది మాత్రమే పాసయ్యారు. పాలకొండ బాలుర జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరంలో 155 మంది పరీక్షలు రాయగా 44 మంది మా త్రమే ఉత్తీర్ణత సాధించారు.
- భామిని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో 96 మంది పరీక్షలు రాయగా 47 మంది మాత్రమే పాసయ్యారు.
- వీరఘట్టం జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరంలో 103 మంది పరీక్షలు రాయగా ఐదుగురే ఉత్తీర్ణులయ్యారు.
- బలిజిపేట జూనియర్ కళాశాలలో 104 మంది ప్రథమ సంవత్సరంలో పరీక్షలు రాగా 32 మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. ఈ విధంగా ప్రథమ సంవత్సర ఫలితాల్లో చాలా ప్రభుత్వ కళాశాలలు వెనుకబడి ఉన్నాయని చెప్పవచ్చు. మరికొన్ని కళాశాలలో 50 శాతం లోపు ఫలితాలే వచ్చాయి.

ద్వితీయ సంవత్సరంలో..

- పాలకొండ ప్రభుత్వ బాలుర కళాశాలలో ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 141 మంది పరీక్షలు రాయగా 76 మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు.
- పార్వతీపురం జూనియర్ శాలలో 159 మంది పరీక్షలు రాయగా 78 మాత్రమే పాసయ్యారు.
- సాలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 149 మంది పరీక్షలు రాయగా కేవలం 58 మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. ఈ విధంగా ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో అనేక ప్రభుత్వ కళాశాలల్లో దారుణమైన ఫలితాలు ఉన్నాయని చెప్పవచ్చు. జిల్లాలో కొమరాడ, మక్కువ, కురుపాం జూనియర్ కళాశాలలు ఫలితాల్లో వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి.

ఫలితాలు భేష్...

జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రథమ, ద్వితీయ సంవత్సర విభాగాల్లో ఉత్తమ ఫలితాలు వచ్చాయని జిల్లా వృత్తివిద్యాశాఖాధికారి డి.మంజులవీణ తెలిపారు. విద్యార్థుల ఉత్తీర్ణత శాతం కూడా బాగుందన్నారు. మొత్తంగా ఒకేషనల్ కోర్సు ఫలితాల్లో రాష్ట్రంలోనే జిల్లా మొదటి స్థానం సాధించిందన్నారు. జనరల్ కోర్సులు సంబంధించి రాష్ట్రంలో 11వ స్థానంలో జిల్లా ఉందని శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు.

శతశాతం ఉత్తీర్ణత

- **గరుగుబిల్లి:** ఇంటర్ పరీక్షా ఫలితాల్లో గరుగుబిల్లి మండలంలోని పలు ప్రభుత్వ కళాశాలలు శతశాతం ఉత్తీర్ణత సాధించాయి. గరుగుబిల్లిలోని డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాలకు సంబంధించి మొదటి సంవత్సరం ఇంటర్‌లో 54 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా వారంతా ఉత్తీర్ణత సాధించారు. కళాశాలకు చెందిన పి.మేఘన ఎంపీసీ విభాగంలో 453 మార్కులు, బైపీసీకి సంబంధించి కె.శ్రావణి 427 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 67 మంది పరీక్షలుకు హాజరు కాగా 67 మంది ఉత్తీర్ణత సాధించారు. ఎంపీసీకి సంబంధించి టి.శిరీష 955 మార్కులు, పి.ధనలక్ష్మి 955 మార్కులు సాధించారు. రావివలసలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, జూనియర్ కళాశాలకు సంబంధించి మొదటి సంవత్సరం బైసీపీకి సంబంధించి 39 మంది బాలికలు హాజరుకాగా వారంతా ఉత్తీర్ణత సాధించారు. కళాశాలకు సంబంధించిన పలువురు 428 మార్కులు సాధించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 33 మంది హాజరుకాగా 33 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 946 మార్కులను పలువురు సాధించారు.
- **మక్కువ:** కాశీపట్నపం కేజీబీవీ నుంచి ప్రథమ సంవత్సరం పరీక్షలకు 35 మంది హాజరుకాగా 35 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 33 మంది హాజరు కాగా 33 మంది ఉత్తీర్ణత సాధించారు.

మాక్ పోలింగ్ తప్పనిసరి

- నియమావళిపై అవగాహన ఉండాలి
- సిబ్బందిని ఆదేశించిన కలెక్టర్



ఎన్నికల నియమావళిపై మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

సీతంపేట: ఎన్నికల నియమాళిపై సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలని, మాక్ పోలింగ్ తప్పనిసరిగా నిర్వహించాలని జిల్లా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం ఐటీడీఏ ఎస్సార్ శంకరన్ సమావేశ మందిరం, వైటీసీ, సీతంపేట సామాజిక భవనాల్లో నిర్వహించిన నియోజక పోలింగ్ అధికారుల శిక్షణ తరగతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలింగ్ రోజు చేపట్టాల్సిన అన్ని అంశాలు, ఈవీఎంల పనితీరుపై విధిగా అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. నిర్దిష్ట సమయానికి పోలింగ్ ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏ సందేహాలున్నా ఇప్పుడే నివృత్తి చేసుకోవాలని, రీపోలింగ్ చేసే అవకాశం రాకుండా చూడాలని ఆదేశించారు. ఈవీఎంలు మొరాయిస్తే వెంటనే సంబంధిత సెక్టార్ అధికారులకు తెలియ జేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాలకొండ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీవో కల్పనాకుమారి, నాలుగు మండలాల తహసీల్దార్లు, మాస్టర్ ట్రైనీలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టు పరిశీలన

పాలకొండ: వెలగవాడ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును కలెక్టర్ నిశాంత్‌కుమార్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చెక్‌పోస్టులోని రికార్డులు పరిశీలించారు. ఎన్నికల నేపథ్యంలో ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సిబ్బందిని ఆదేశించారు. అక్రమంగా డబ్బు రవాణా, మాదక ద్రవ్యాలు తరలిస్తే కేసులు నమోదు చేయాలని సూచించారు. అధిక మొత్తంలో డబ్బు ఉంటే దానికి సంబంధించిన పత్రాలు పక్కాగా ఉండాలని, లేకపోతే సీజ్ చేయాలని తెలిపారు. చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ తనిఖీల్లో డీఎస్పీ జీవీ కృష్ణారావు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

శిక్షణ సద్వినియోగం చేసుకోండి: ఆర్డీవో



పీవోలకు సూచనలిస్తున్న ఆర్డీవో

కురుపాం: శిక్షణను సద్వినియోగం చేసుకుని సజావుగా ఎన్నికలు జరిగేలా చూడాలని పాలకొండ ఆర్డీవో, కురుపాం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వీవీ రమణ ఆదేశించారు. స్థానిక ఆదర్శ పాఠశాలలో పీవో, ఏపీవోలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... శిక్షణ కార్యక్రమంలో అన్ని విషయాలు నేర్చుకొని.. పూర్తి అవగాహనతో పోలింగ్ కేంద్రలకు వెళ్లాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో అతి కీలక బాధ్యత వహించేది పీవోలు, ఏపీవోలేనని వెల్లడించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి సత్యనారాయణ, ఎంఈవో సత్యనారాయణ, 200 మంది పీవోలు, ఏపీవోలు, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

17 సీ నింపారా? డైరీ ఎలా నమోదు చేస్తారు?

- పీవో, ఏపీవోలను ప్రశ్నించిన ఐటీడీఏ పీవో విష్ణుచరణ్



ఏఎల్‌ఎంటీ నుంచి శిక్షణ వివరాలు తెలుసుకుంటున్న ఐటీడీఏ పీవో

సాలూరు/సాలూరు రూరల్, ఏప్రిల్ 12: 'ఎన్నికల్లో వినియోగించే 17 సీ ఫారం నింపారా? పీవో డైరీని ఏ విధంగా నమోదు చేస్తారు' అని పార్వతీపురం ఐటీడీఏ పీవో, సాలూరు ఆర్వో సి.విష్ణుచరణ్ పీవో, ఏపీవోలను ప్రశ్నించారు. పోలింగ్ నిర్వహణపై శుక్రవారం సాలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏయే అంశాలను వివరించారని శిక్షణ ఇస్తున్న ఏఎల్‌ఎంటీ సింహాచలంను పీవో అడిగి తెలుసుకున్నారు. పోలింగ్‌లో అత్యంత కీలకమైన 17 సీ, పీవో డైరీ నమోదుపై శిక్షణ పొందుతున్నవారిని ప్రశ్నించారు. ఎన్నికల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికల నిర్వహణలో నిర్లక్ష్యం వహించరాదని, శిక్షణను సద్వినియోగం చేసుకొని సమర్థంగా విధులు నిర్వహించాలని సూచించారు. అనంతరం ఎన్నికల ప్రవర్తనా నియమావళి, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విధులు నిర్వహణ తదితర అంశాలపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల విధుల్లో ప్రిసైడింగ్ , సెక్టర్ అధికారులే కీలకమన్నారు. ఎక్కడా ఎలాంటి లోపాలు తలెత్తకుండా చూడాలన్నారు. మాక్ పోలింగ్ మొదలుకొని స్ట్రాంగ్ రూంలో ఈవీఎంలు భద్రపరిచే వరకు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. అనంతరం రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని పరిశీలించారు. తొలిరోజు నాలుగు గదుల్లో 200 మంది పీవో,ఏపీవోలకు ఏఎల్‌ఎంటీలు సింహాచలం, గౌరీశంకరరావు, చంద్రశేఖర్,మహమ్మద్ తదితర ఎనిమిది మంది శిక్షణనిచ్చారు. ఆయన వెంట తహసీల్దార్లు సింహాచలం, ఆనంద్ కుమార్, దిలీప్ చక్రవర్తి, ఎంపీడీవో ఫణికుమార్, ఆర్ఐ మర్రి జగదీశ్వరరావు, ఎన్నికల డీటీ రాజశేఖర్, వీఆర్వోలు తదితరులు తదితరులు పాల్గొన్నారు.

మే 24 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

విజయనగరం, కలెక్టరేట్, ఏప్రిల్ 12: ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు మే 24 నుంచి జూన్ ఒకటో తేదీ వరకూ జరగనున్నాయని ఆర్ఐవో మజ్జి ఆదినారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రథమ సంవ త్సరం విద్యార్థులకు రోజూ ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయని వెల్లడించారు. మే ఒకటో తేదీ నుంచి 4 వరకు ప్రయోగ పరీక్షలు జరగనున్నాయని తెలిపారు.

ఎమ్మెల్యే జోగారావుకు చుక్కెదురు

- సమస్యలపై నిలదీసిన గ్రామస్థులు



ఎమ్మెల్యే జోగారావును నిలదీస్తున్న మహిళలు

సీతానగరం: సీతానగరం మండలం లక్ష్మీపురంలో వైసీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే జోగారావుకు చేదు అనుభవం ఎదురైంది. శుక్రవారం గ్రామంలో ఆయన ఇంటింటి ప్రచారం చేస్తుండగా.. పలు సమస్యలపై గ్రామస్థులు ఆయన్ని నిలదీశారు. ప్రధానంగా బెవర్ల వీధిలో పూతి గౌరమ్మ, మెయిన్‌రోడ్డులో పువ్వల పుణ్యవతి తదితరులు ఇంటి బిల్లులు, అభివృద్ధి పనులపై ప్రశ్నించారు. బెవర్ల వీధిలో రహదారి సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. సచివాలయం కోసం తీసుకొచ్చిన సిమెంట్, ఐరెన్ ఏమైందని మరికొందరు అడిగారు. జగనన్న లేఅవుట్‌లో పేదవారికి ఇళ్ల స్థలాలు ఇవ్వలేదని ధ్వజమెత్తారు. అర్హులకు ఇవ్వకుండా.. అనర్హులకు స్థలాలు విక్రయించారన్నారు. బెవర్ల వీధిలో అభివృద్ధి జరగక పోవడానికి కారణం ఎంపీటీసీ, సర్పచ్ కారణమని ఆ ప్రాంతవాసులు ఆరోపించారు.

ఏదీ ధరల స్థిరీకరణ?



- గత ఎన్నికల సమయంలో సీఎం జగన్ హామీ
- ఐదేళ్లు గడిచినా.. కనీస ప్రయత్నాల్లేవ్..
- షాకిస్తున్న బియ్యం ధరలు
- నియంత్రణకు చర్యలు శూన్యం
- ఆందోళనలో జిల్లావాసులు

(కొమరాడ, ఏప్రిల్ 12)

'అధికారంలోకి వచ్చిన వెంటనే రూ. 5 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేస్తాం. ప్రభుత్వమే మద్దతు ధరకు పంట ఉత్పత్తులు కొనుగోలు చేస్తుంది. దళారుల ప్రమేయం ఉండదు. వ్యాపారుల కృత్రిమ కొరత ఉండదు. రైతులు, వినియోగదారులకు ఇది ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.' అని గత ఎన్నికల సమయంలో ప్రతిపక్ష నాయకుని హోదాలో సీఎం జగన్ ప్రకటించారు. అయితే పాలనా పగ్గాలు చేపట్టి ఐదేళ్ల గడిచినా.. ఇంతవరకు ఆ దిశగా ప్రయత్నాల్లేవు. రోజురోజుకూ నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతున్నా.. కనీస చర్యల్లేవు. దీంతో ఐదేళ్ల పాలనలో వాటి ధరలు ఎంతగా పెరిగాయో అందరికీ తెలిసిన విషయమే. ముఖ్యంగా బియ్యం ధరలు సామాన్యులను బెంబేలెత్తిస్తున్నాయి. బయట మార్కెట్లో వాటిని కొనుగోలు చేయాలంటేనే.. హడలెత్తిపోతున్నారు. వాస్తవంగా ఇంటింటికి రేషన్ పంపిణీలో భాగంగా మేలు రకం బియ్యం పంపిణీ చేస్తున్నామని వైసీపీ ప్రభుత్వం గొప్పలు చెబుతోంది. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి రేషన్‌కార్డులో ఉన్న ఒక్కొక్కరికీ నెలకు 10 కేజీల బియ్యం పంపిణీ చేయాల్సి ఉంది. కాగా రాష్ట్ర ప్రభుత్వం వద్ద నగదు నిండుకోవడంతో ఏడాదిన్నరగా లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున బియ్యం అందించడం లేదు. కేవలం కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న ఉచిత బియ్యాన్ని మాత్రమే అందిస్తోంది. వాస్తవంగా రాష్ట్ర ప్రభుత్వం మిల్లర్ల వద్ద కిలో బియ్యాన్ని రూ.42కు కొనుగోలు చేసి పేదలకు రూపాయికే బియ్యం ఇవ్వాలి. అయితే అప్పులతో నడుస్తున్న సర్కారు బియ్యం భారం మేయలేక చేతులెత్తేసింది. దీంతో కేంద్ర సర్కారు అందిస్తున్న బియ్యాన్నే ఉచితంగా పంపిణీ చేస్తూ.. ఇదంతా తమ గొప్పతనమే అన్నట్లుగా వైసీపీ ప్రభుత్వం ప్రచారం చేసుకుంటోంది. కాగా ప్రతినెలా ఐదు కేజీల చొప్పున అందించే రేషన్ బియ్యం ఎటూ చాలకపోవడంతో సామన్య ప్రజలు బయట మార్కెట్లోనే బియ్యాన్ని కొనుగోలు చేయాల్సి వస్తోంది. అయితే 26 కిలోల సోనా మసూరీ బియ్యం బస్తా ధర రూ. 1100 నుంచి ఏకంగా రూ. 1600కు పెరిగింది. దీంతో పేద, మధ్య తరగతి వర్గీయులు షాక్‌కు గురవుతున్నారు. ఆ ధరలను చూసి వణికిపోతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో తమ స్థోమతకు తగ్గట్లుగా ఆ బియ్యం కొనుగోలు చేస్తున్నప్పటికీ వారిపై ప్రతినెలా అదనపు భారం పడుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బియ్యం ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని జిల్లావాసులు కోరుతున్నారు.



భరించలేకపోతున్నాం..

బియ్యం ధరలను భరించలేకపోతున్నాం. గతంలో కన్నా భారీగా పెరిగాయి. మా లాంటి పేదలు బయట మార్కెట్లో కొనుగోలు చేయలేకపోతున్నారు. బియ్యం ధరల నియంత్రణకు అధికారులు పటిష్ఠ చర్యలు తీసుకోవాలి.

– డి.లక్ష్మి, వ్యవసాయ కూలీ, పెదఖేర్జల, కొమరాడ మండలం

జ్వరాలపై సర్వే

- డీఎంవో జగన్మోహన్‌రావు

గరుగుబిల్లి, ఏప్రిల్ 12 : గ్రామాల పరిధిలోని వైద్య సిబ్బంది ఇంటింటా జ్వరాలపై సర్వే చేయాలని జిల్లా మలేరియా అధికారి (డీఎంవో) టి. జగన్మోహన్‌రావు సిబ్బందిని ఆదేశించారు. పంచాయతీల్లో వ్యాధులు ప్రబల కుండా అవసరమైన పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టాలన్నారు. శుక్రవారం చినగుడబ, పెదగుడబ సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దోమలు అధికంగా వృద్ధి చెందకుండా చూడాలన్నారు. మురుగు కాలువాలు, రహదా రులకు ఆనుకుని ఉన్న వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. ప్రతి శుక్రవారం పంచాయతీల పరిధిలో డ్రైడేను విధిగా నిర్వహించాలని సూచించారు. అనంతరం గృహాలకు ఆనుకుని ఉన్న నీటి నిల్వలను పరిశీలించారు. ఇళ్లలో వాడుతున్న చెత్తలను తొట్టెల్లో వేసేలా అవగాహన కల్పిం చారు. మలేరియా, డెంగ్యూ జ్వరాలతో పాటు పలు రోగాలతో పల్లెవాసులు సతమతమవకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. నిరంతరం అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. డ్రైడే వివరాలను సంబంధిత యాప్‌లో పొందుపర్చాలని సూచించారు. సంబంధిత సచివాలయాల్లో అవసరమైన మందులు, పరీక్షల సామగ్రిని అందుబాటులో ఉంచాలన్నారు. ఈ పరిశీలనలో ఏఎంవో సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు పి.శిరీష, డి.దిలీప్ కుమార్, వైద్య సిబ్బంది మౌనిక, ఈశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.



చినగుడబలో పరిసరాలను పరిశీలిస్తున్న డీఎంవో

గడ్డి మందు తాగిన వ్యక్తి మృతి

కొమరాడ: మాదలంగి గ్రామంలో గురువారం రాత్రి గడ్డి మందు తాగిన అధికారి వెంకటేష్(32) అనే వ్యక్తి శుక్రవారం ఉదయం మృతి చెందినట్లు కొమరాడ ఎస్ఐ నీలకంఠం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం రాత్రి మద్యం తాగి రావడంతో భార్య రమాదేవి నిలదీసింది. దీంతో మనస్థాపానికి గురైన వెంకటేష్ గడ్డి మందు తాగాడు. దీంతో వెంటనే కురుపాం వైద్యశాలకు తీసుకువెళ్లి చికిత్స అందించారు. మరింత మెరుగైన చికిత్స కోసం పార్వతీపురం కేంద్రాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నట్లు తెలిపారు.

మద్యం సీసాలు స్వాధీనం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఏవోబీ సరిహద్దు తాటీశీల గ్రామంలో ఒడిశా నుంచి కారు, ద్విచక్ర వాహనంలో వస్తున్న ఇరువురు వద్ద నుంచి ఆంధ్రాకు అక్రమంగా తరలిస్తున్న సుమారు 141 మద్యం సీసాలను ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ, ఎస్ఐ శివ ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కారు, బైకును, మద్య సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

● **కొమరాడ:** మండలంలో రాజ్యలక్ష్మీపురం గ్రామానికి చెందిన బొట్ట రామకృష్ణ అనే వ్యక్తి నుంచి 46 మద్యం సీసాలను సీజ్ చేసినట్టు ఎస్ఐ నీలకంఠం తెలిపారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

బాడంగి: అక్రమంగా మద్యం, నగదు తరలించడాన్ని నిరోధించడానికి గట్టి చర్యలు తీసుకుంటున్నామని ఎస్ఐ ఆర్.జయంతి తెలిపారు. మండల కేంద్రంలో ఆమె శుక్రవారం వాహనాలు తనిఖీ చేశారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

అంబేడ్కర్ గురుకులాల్లో 87.4 శాతం ఉత్తీర్ణత

సాలూరు రూరల్: ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ఉమ్మడి విజయనగరం జిల్లా బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో 87.4 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు జిల్లా కోఆర్డినేటర్ టి.పద్మజ శుక్రవారం తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 612 మంది ద్వితీయ సంవత్సరం పరీక్షలకు విద్యార్థులు హాజరు కాగా 535 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. కొమరాడ, బాడంగి, వేపాడ, గరుగుబిల్లి గురుకులాల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించాయని చెప్పారు.

గంజాయి స్వాధీనం

పాచిపెంట: మండలంలోని పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద పోలీసుల తనిఖీలో రెండు కిలోల వంద గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశామని ఎస్ఐ పి.నారాయణరావు తెలిపారు. కేరళకు చెందిన శిబిన్ జోసెఫ్, మితలేజ్‌లను అరెస్టు చేసినట్టు చెప్పారు. ఒడిశా నుంచి దిగుమతి చేస్తుండగా కాలేజీ బ్యాగులో ఉన్న గంజాయి ప్యాకెట్లను పట్టుకున్నారు. దీని విలువ రూ.21 వేలు ఉంటుందని తెలిపారు.

టేకు చెట్ల నరికివేతపై ఫిర్యాదు



మాట్లాడుతున్న బాధితురాలు, కుటుంబ సభ్యులు

మెంటాడ: కుంటినవలస గ్రామంలో వై.సింహాచలం అనే వైసీపీ నాయకుడు తన టేకు చెట్లను అక్రమంగా నరికివేసినట్టు అదే గ్రామానికి చెందిన శ్రీదేవి అనే మహిళ శుక్రవారం అధికారులకు ఫిర్యాదు చేశారు. సుమారు లక్ష రూపాయలు విలువ చేసే ఏడు చెట్లను దౌర్జన్యంగా తమ భూమిలో నరికివేసి తరలించేందుకు సిద్ధపడ్డారని, విషయం తెలిసి ప్రశ్నించగా బెదిరింపు ధోరణిలో మాట్లాడుతున్నారని ఆమె వాపోయారు. న్యాయం జరిగేలా చూడాలని రెవెన్యూ, అటవీ శాఖల అధికారులతో పాటు స్థానిక పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో విజ్ఞప్తి చేశారు. విలేకర్ల ముందు తమ గోడును వెళ్లగక్కారు. స్థానిక పెద్దలు, సర్పంచ్‌ను కలిసి జరిగిన విషయం చెప్పామని, అయినా న్యాయం జరగలేదన్నారు. అందుకే అధికారులను ఆశ్రయించినట్టు చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బొబ్బిలి: బొబ్బిలి మండలంలోని వివిధ గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ ఆవాల అనంతరావు తెలిపారు. పారాది సబ్‌స్టేషన్ నుంచి వచ్చే 11 కేవీ మెట్టవలస ఫీడరు మధ్యలో విద్యుత్ స్తంభాలు వేయడానికి, లైన్లను పటిష్టం చేసేందుకు శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయాల్సి ఉంటుందన్నారు. దీని వల్ల పనుకువలస, కొత్తపెంట, మెట్టవలస, గున్నతోటవలస గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. పిరిడి సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఎ.వెలగవలస, అలజంగి, కారాడ, శివడవలస, పక్కి గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరా నిలిచిపోతున్నందున వినియోగదారులు సహకరించాలని అనంతరావు కోరారు.

రేపు గోపాలపురం సబ్‌స్టేషన్ పరిధిలో..

రాజాం: బొబ్బిలి రోడ్డులోని గోపాలపురం సబ్‌స్టేషన్ నిర్వహణ పనులు చేపట్టనున్నందున ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏఈ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. బొబ్బిలి రోడ్డు, చీపురుపల్లి రోడ్డు, గొలవీధి. మాదిగ వీధి, మెంతిపేట ఎస్సీ కాలనీ, అమ్మవారి కాలనీ, చాకలి వీధి, ఆదర్శనగర్, బాలాజీనగర్, వస్త్రపురికాలనీ, కంచరాం, రాజయ్యపేట, గోపాలపురం, కొత్తవలస, మెంతిపేట, కొండంపేట తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. పరిశ్రమలకు కూడా సరఫరా నిలిపివేయనున్నట్టు ప్రకటించారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవారి ఆలయ ప్రతిష్ఠ

రేగిడి: ఉంగరాడమెట్ట, జాడపేట గ్రామాల మధ్యనున్న సూరమ్మకొండ గుట్టపై వెలిసిన భవతారిణి ఆలయ ప్రతిష్ఠోత్సవాలు రెండోరోజు శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ పూజల్లో నిర్వాహకులు నడిపేన సన్నిబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిరుపేదలకు నిత్యావసరాల పంపిణీ

విజయగనరం రూరల్: నగరంలోని మారుతీ స్వయం సేవా సంఘం ఆధ్వర్యంలో కణపాక ఆగురువీధిలో శుక్రవారం 50 మంది నిరుపేదలకు బియ్యం, నిత్యావసరాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు గుత్తూరు చంద్రశేఖర్, సభ్యులు అరసాడ అప్పలస్వామి, తులసీరామ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

● ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి
● రాష్ట్ర ఎన్నికల పరిశీలకుడు మిశ్రాకు వివరాల వెల్లడి



కంట్రోల్ రూంను పరిశీలిస్తున్న మిశ్రా

కలెక్టరేట్: ఎన్నికల సాధారణ పరిశీలకుడు రామ్మోహన్ మిశ్రా శుక్రవారం విజయనగరం జిల్లాలో పర్యటించారు. ఆయనకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి స్వాగతం పలికారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లు, ప్రవర్తనా నియమావళి అమలుకు తీసుకున్న చర్యలు, సీజర్ మేనేజ్‌మెంట్, ఎన్నికల శిక్షణ తదితర అంశాలను తన చాంబర్‌లో జరిగిన సమావేశంలో కలెక్టర్ వివరించారు. ఇప్పటి వరకు జిల్లాలో సుమారు రూ.1.54 కోట్ల విలువైన, నగదు, మద్యం, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఎన్నికల కంట్రోల్ రూంను, మీడియా సెంటర్‌ను పరిశీలకులు మిశ్రా సందర్శించారు. ఈ పర్యటనలో ఎస్పీ దీపికా పాటిల్, జేసీ కార్తీక్ పాల్గొన్నారు.

ఈవీఎంల కేటాయింపు..

వచ్చే ఎన్నికల్లో వినియోగించేందుకు ర్యాండమైజేషన్ ద్వారా ఈవీఎంలను కేటాయించారు. స్థానిక ఎన్ఐసీ కార్యాలయంలో రాష్ట్ర ఎన్నికల సాధారణ పరిశీలకులు రామ్మోహన్ మిశ్రా, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టర్ నాగలక్ష్మి శుక్రవారం ఈ ప్రక్రియను నిర్వహించారు. కంప్యూటర్ ర్యాండమైజేషన్ ద్వారా వివిధ నియోజకవర్గాలకు ఈవీఎంలను కేటాయించారు.

సెల్ఫీ పాయింట్‌ను ప్రారంభించిన కలెక్టర్

కలెక్టరేట్ పోర్టికోవద్ద ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్‌ను కలెక్టర్ నాగలక్ష్మి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఎంతో విలువైన తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని చెప్పారు. ఓటు నమోదుకు ఇంకా మూడు రోజులు గడువు ఉందని తెలిపారు.

రూ.7.22 లక్షల నగదు సీజ్

బొబ్బిలి: బొబ్బిలి సర్కిల్ పరిధిలో శుక్రవారం నిర్వహించిన వాహన తనిఖీల్లో ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.7,22,530 నగదును సీజ్ చేసినట్లు డీఎస్పీ పి.శ్రీనివాసరావు తెలిపారు. పాతబొబ్బిలి చెక్‌పోస్టు వద్ద తగరపువలసకు చెందిన తీల రమేష్ నుంచి రూ.3,42,500, జగ్గునాయుడుపేటకు చెందిన పూడి రామకృష్ణ నుంచి రూ.72 వేలు, బొబ్బిలి కంచరవీధికి చెందిన బంగార్రాజు నుంచి రూ.1.45 లక్షలు, రాజాం నుంచి తెర్లాంకు బొలేరా వాహనంలో వస్తున్న వ్యాపారి నుంచి రూ.73,500 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అలాగే, రామభద్రపురంలో సాలూరు నుంచి విజయనగరం వైపు వెళుతున్న వ్యక్తి నుంచి రూ.89,530 పట్టుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ లోవరాజు, సిబ్బంది ఉన్నారు.

రాజాంలో రూ.5 లక్షలు..

రాజాం రూరల్: రాజాం-శ్రీకాకుళం రోడ్‌లో పొగిరి జంక్షన్ వద్ద శుక్రవారం పోలీసులు చేపట్టిన వాహన తనిఖీల్లో నగదు పట్టుబడింది. శ్రీకాకుళం నుంచి రాజాం వైపు వస్తున్న కారును రాజాం టౌన్ సీఐ మోహనరావు, ఎస్ఐ రవికిరణ్ తనిఖీ చేయగా ప్లాస్టిక్ కవర్‌లో ఉన్న రూ.5,23,300ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నగదుకు సంబంధించి సరైన పత్రాలు లేకపోవడంతో సీజ్ చేశారు. నగదును తరలిస్తున్న వ్యక్తిని రాజాం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వినియోగదారుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

విజయనగరం రింగురోడ్డు: వినియోగదారుల సమస్యలు పరిష్కరించడమే తమ లక్ష్యమని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) చైర్‌పర్సన్, విశ్రాంత జిల్లా న్యాయమూర్తి డాక్టర్ బి.సత్యనారాయణ అన్నారు. దాసన్నపేట విద్యుత్ భవనంలో శుక్రవారం విద్యుత్ లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వినియోగదారులు తమ సమస్యలపై ఆయనకు వినతిపత్రం అందజేశారు. వీటిని పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం, హెచ్చుతగ్గులు, మీటర్ సమస్య ఎక్కువ బిల్లులు, ట్రాన్స్‌ఫార్మర్లు ఓవర్ లోడ్‌తో దగ్ధమవడం, బిల్లు పేర్లలో మార్పు తదితర సమస్యలను పరిష్కరిస్తామన్నారు. 2023లో 536 ఫిర్యాదుల్లో 509 పరిష్కరించామన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ వరకూ 140 ఫిర్యాదులు అందగా, 24 పరిష్కరించినట్టు తెలిపారు. 2016 నుంచి ఈ ఏడాది ఏప్రిల్ వరకూ రూ.26 వేల అపరాధ రుసుం విధించినట్టు తెలిపారు. విద్యుత్ సమస్యలను అధికారులు పరిష్కరించనప్పుడు తగిన ఆధారాలతో తమ ఫోరం దృష్టికి లిఖిత పూర్వకంగా తీసుకురావాలన్నారు. ఫోరంలో కేసులు వేయడానికి ఎలాంటి రుసుం చెల్లించాల్సిన పని లేదన్నారు. ఫిర్యాదులను 1912 (టోల్ ఫ్రీ)కి చేయవచ్చునన్నారు. కార్యక్రమంలో ఫోరం సభ్యులు ఎం.శ్రీనివాసరావు, ఎం.జనార్దనరావు, సూపరింటెండెంట్ ఇంజనీరు మువ్వల లక్ష్మణరావు, విద్యుత్ శాఖాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



వినియోగదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న దృశ్యం

ముగిసిన కానిస్టేబుల్ అంత్యక్రియలు



అంత్యక్రియలు చేస్తున్న దృశ్యం

వంగర: విశాఖపట్నంలోని ఓ బ్యాంక్‌లో ఎస్‌పీఎఫ్ కానిస్టేబుల్ పాలవలస శంకరరావు గురువారం తుపాకీతో కాల్చుకొని ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. గురువారం రాత్రి 8 గంటలకు అతని మృతదేహం స్వగ్రామానికి చేరుకుంది. శుక్రవారం ఉదయం కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు.



మాట్లాడుతున్న ఎంఈఓ దుర్గారావు

ఉపకరణాలకు దివ్యాంగుల ఎంపిక

రాజాం: స్థానిక భవిత కేంద్రంలో నియోజకవర్గ స్థాయిలో దివ్యాంగ చిన్నారులకు ఉపకరణాల నిర్ధారణ శిబిరం శుక్రవారం నిర్వహించారు. రాజాం, వంగర, రేగిడి, సంతకవిటి మండలాలకు చెందిన 18 ఏళ్లలోపు దివ్యాంగులు ఈ శిబిరానికి హాజరయ్యారు. 41 మందిని వీల్ ఛైర్స్‌కు, 37 మందిని రోలేటర్స్‌కు, 22 మందిని ట్రైసైకిళ్లకు, 11 మందిని ఎంఆర్ కిట్స్‌కు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జిల్లా సహిత విద్యా సమన్వయకర్త ఎస్.సూర్యారావు, ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు, ఎంఈఓ వై.దుర్గారావులు మాట్లాడుతూ దివ్యాంగులైన చిన్నారులకు స్వచ్ఛంద సంస్థలు పరికరాలను అందించి ఆదుకోవడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సరిశీలకులు అమ్మినాయుడు, రేగిడి ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు, శాంతికుమారి, వైద్యులు రాజశేఖర్, నేతాజీ, ఐఈఆర్‌టీలు ఎస్.హరిబాబు, ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి

ఫారం-డిపై నిర్లక్ష్యం వద్దు

రాజాం: ఫారం డి విషయంలో బీఎల్ఓలు నిర్లక్ష్యం చేయవద్దని ఎన్నికల రిటర్నింగ్ అధికారి జోసెఫ్ ఆదేశించారు. శుక్రవారం తహసీల్దారు కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి బీఎల్ఓలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 80 ఏళ్లు దాటి వారితో ఫారం-డిని నింపించి.. ఈనెల 18 నుంచి 22వతేదీ లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో తహసీల్దారు ఎస్.కృష్ణంరాజు, ఎన్నికల డీటీ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి సాయం

బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలో ఇటీవల గుండెపోటుతో మరణించిన హోంగార్డు కెంగువ మహేశ్ కుటుంబానికి స్థానిక పోలీసు సిబ్బంది ఆపన్నహస్తం అందించారు. సీఐ మలిరెడ్డి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది రూ.46 వేల ఆర్థిక సాయం అందించారు. ఎస్ఐ సత్యనారాయణ తదితరులు మహేశ్ ఇంటికి వెళ్లి ఆయన భార్యకు శుక్రవారం ఈ మొత్తాన్ని అందజేశారు. ఆ కుటుంబ సభ్యులను ఓదార్చారు.



హోంగార్డు కుటుంబ సభ్యులకు సాయం అందజేస్తున్న ఎస్ఐ చదలవాడ సత్యనారాయణ

పైడిమాంబ దేవస్థానం అన్నదానానికి నూతన భవనం



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఆలయ అధికారులు

విజయనగరం రూరల్: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లమ్మ దేవస్థానంలో అన్నదానానికి నూతన భవనం అందుబాటులోకి వచ్చింది. ఇప్పటి వరకూ శివాలయం వీధిలో ఉన్న పైడిమాంబ కల్యాణ మండపంలో అన్నదానం చేస్తున్నారు. పైడిమాంబ ఆలయ విస్తరణలో భాగంగా అన్నదాన కార్యక్రమాన్ని మూడు లాంతర్ల వద్ద చదురు గుడి వెనుక భాగాన ఉన్న భవనంలోకి మార్చారు.. శుక్రవారం ఈఓ డీవీ ప్రసాద్, సూపరిడెంటెంట్ ఏడు కొండలు, అర్చకుడు బంటుపల్లి వెంకటరావు, పురోహితులు పూజలు నిర్వహించిన అనంతరం నూతన భవనంలో భక్తులకు అన్నదానం చేశారు. ఈఓ డీవీ ప్రసాదరావు మాట్లాడుతూ పైడిమాంబ అన్నదాన ట్రస్టుకు భక్తులు విరాళాలు ఇచ్చి.. రశీదు పొందాలన్నారు.

కూలీ గిట్టుబాటు కావడం లేదు



కూలీలతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు

లక్కవరపుకోట (కొత్తవలస): ఉపాధి హామీ పథకం పనిలోకి వెళ్లిన వారికి కూలీ గిట్టుబాటు కావడం లేదని... ఇకపై పనికి వెళ్లలేమని గాంధీనగర్ గ్రామానికి చెందిన కూలీలు నిరసన వ్యక్తం చేస్తూ ఇంటిముఖం పట్టారు. దీంతో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ నాయకుడు గాడి అప్పారావు కూలీలతో మాట్లా డి... సమస్య పరిష్కారానికి ఎంపీడీవో కార్యాలయ అధికారులతో మాట్లాడుదామని చెప్పడంతో కూలీలు శాంతించారు. కొత్త ఏడాది నుంచి రోజుకు రూ.300 అని చెప్పి కేంద్ర ప్రభుత్వం కూలీలను మోసం చేసిందన్నారు. ఒక్కో మనిషికి రూ.51, రూ.61, రూ.91 వంతున ఖాతాల్లో పడ్డాయని మండిపడ్డారు.

కోడిపందేలపై పోలీసుల దాడి

శృంగవరపుకోట: చామాలపల్లి పంచాయతీ కొత్తకోట గ్రామశివారుల్లో జరుగుతున్న కోడిపందేలపై సీఐ మురళి ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. శుక్రవారం సాయంత్రం పోలీసులకు అందిన సమాచారం మేరకు ఎస్ఐ గంగరాజు సిబ్బందితో వెళ్లి ముగ్గురు పందెపురాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. రెండు కోడిపుంజులు, రూ.300 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు.

ట్రావెల్స్ బస్సు ఢీకొని యువకుడి మృతి

మద్దిలపాలెం: వీఐపీ రోడ్డులో శుక్రవారం ఉదయం జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. మూడో పట్టణ ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వేపాడ మండలం కృష్ణరాజపురానికి చెందిన రాజ్‌కుమార్ (30) పాస్టర్‌గా శిక్షణ తీసుకున్నాడు. అతనికి చెవికి సంబంధించిన సమస్య ఉండడంతో ఉదయం బైక్‌పై నగరానికి వచ్చాడు. వీఐపీ రోడ్డు మీదుగా వెళుతుండగా లక్ష్మీగణపతి ఆలయం వద్ద వెనుక నుంచి వస్తున్న ట్రావెల్స్ బస్ ఢీకొంది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ట్రాఫిక్ ఏడీసీపీ శ్రీనివాస్, సీఐ అమ్మినాయుడు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బొడ్డాంలో ఉద్రిక్తత

● వైసీపీ ప్రచారంలో వలంటీర్లు ● ప్రశ్నించిన టీడీపీ శ్రేణులు



గ్రామంలో పోలీసు పహారా

రాజాం రూరల్: మండల పరిధిలోని బొడ్డాం గ్రామంలో శుక్రవారం రాత్రి ఉద్రిక్తత నెలకొంది. గ్రామంలో అధికార వైసీపీ నాయకుల ఎన్నికల ప్రచారంలో వలంటీర్లు పాల్గొనడమే దీనికి కారణం. విషయం తెలుసుకున్న టీడీపీ శ్రేణులు ఎన్నికల ప్రచారంలో వలంటీర్లు పాల్గొనడాన్ని ప్రశ్నించారు. తాము రాజీనామా చేశామని... ప్రశ్నించేందుకు మీకున్న అధికారం ఏమిటని వలంటీర్లు టీడీపీ శ్రేణులను ప్రశ్నించారు. దీంతో రాజాం ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావును వలంటీర్ల రాజీనామా వ్యవహారంపై టీడీపీ శ్రేణులు ప్రశ్నించాయి. గ్రామంలో 24 మంది వలంటీర్లు ఉండగా... కేవలం ఇద్దరు మాత్రమే రాజీనామా చేశారని ఎంపీడీఓ స్పష్టం చేశారు. దీంతో ప్రచారం నుంచి వైదొలగాలని వలంటీర్లను టీడీపీ నేతలు గట్టిగా నిలదీశారు. ఈ క్రమంలో ఇరుపార్టీల నాయకుల మధ్య వాదోపవాదాలు చోటుచేసుకున్నాయి. విషయం తెలుసుకున్న రాజాం టౌన్ సి.ఐ.మోహనరావు ఆధ్వర్యంలో పోలీసులు రాత్రి పది గంటల సమయంలో రంగప్రవేశం చేశారు. ఇరువర్గాలను చెదరగొట్టారు. అధికార పార్టీ ఎన్నికల ప్రచారంలో గ్రామ వలంటీర్లు నక్క. గణేష్, మూకళ్ల లక్ష్మి, నక్క ధనలక్ష్మి, బట్న వెంకట లక్ష్మి, నక్క పార్వతి, మూకళ్ల శిరీష, బెండు లక్ష్మణరావు, బట్న భాగ్యలక్ష్మి, బట్న లక్ష్మి, అలజంగి లాస్య పాల్గొన్నారని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. వీరందరినీ విధుల నుంచి తప్పించాలని టీడీపీ నాయకులు హరి, విష్ణు, సూర్యనారాయణ తదితరులు డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా.... గ్రామంలో పరిస్థితి అదుపులో ఉందని సి.ఐ.మోహనరావు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

ప్రచారంలో పాల్గొన్న వలంటీర్లపై ఫిర్యాదు

బొబ్బిలి: బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పల నాయుడుకు మద్దతుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వార్డు వలంటీర్లపై ఎన్నికల అధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. గొల్లపల్లి గ్రామంలో ఎమ్మెల్యే శంబంగి, మున్సిపల్ ఛైర్మన్ సావు వెంకటమురళీ కృష్ణారావు ఆధ్వర్యంలో ఒక వైసీపీ బృందం, శంబంగి సోదరుడు వేణుగోపాలనాయుడు, మాజీ కౌన్సిలరు తెర్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో మరో బృందం, శంబంగి కుమారుడు శ్రీకాంత్, పట్టణ పార్టీ అధ్యక్షుడు చోడిగంజి రమేష్‌నాయుడు తదితరుల ఆధ్వర్యంలో మరో బృందం ఇంటింటి ప్రచారం చేశారు. ఈ ప్రచారంలో ఆరుగురు వలంటీర్లు పాల్గొన్నట్లు గ్రామస్తులు ఎన్నికల అధికారులకు ఫొటోలతో సహా ఫిర్యాదులు పంపించారు.

విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం..

గొల్లపల్లిలో వలంటీర్లు ప్రచారంలో పాల్గొన్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. ఇది నిబంధనలకు విరుద్ధం. ఇది రుజువైతే కఠిన చర్యలు తీసుకుంటాం. మాకు వచ్చిన ఫిర్యాదుపై సచివాలయం అడ్మిన్‌ను విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని కోరాం. ముందుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వలంటీర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తాం. రుజువైతే వారిని తొలగిస్తాం.

-లాలం రామలక్ష్మి, మున్సిపల్ కమిషనర్

అధికారుల పనితీరుపై టీడీపీ ధ్వజం

● వాడీవేడిగా బాడంగి మండల సమావేశం



అధికారులను నిలదీస్తున్న గజరాయనివలస ఎంపీటీసీ సభ్యుడు గౌరి

బాడంగి: వివిధ శాఖల అధికారుల పనితీరుపై టీడీపీ వైస్ ఎంపీపీ, ఎంపీటీసీ, సర్పంచులు తీవ్రంగా ఆక్షేపించారు. శుక్రవారం ఎంపీపీ బొగ్గి గౌరి అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరిగింది. తెంటువలస సర్పంచ్ తెంటు చిరంజీవి మాట్లాడుతూ 2018లో అంగన్‌వాడీ బిల్డింగ్ కట్టామని, ఇప్పటికీ బిల్లులు ఇవ్వలేదని ప్రశ్నించారు. దీంతో ఆ శాఖకు సంబంధించిన అధికారి బిక్కమొహం వేశారు. ఇల్లు కట్టమన్నారు... తీరా కట్టాక వైసీపీ ప్రభుత్వంలో ప్రతి సర్వసభ్య సమావేశంలో అడుగుతున్నప్పటికీ పాలవలస సింహాచలానికి బిల్లు ఇవ్వలేదని గజరాయనివలస టీడీపీ ఎంపీటీసీ సభ్యులు పాలవలస గౌరి అధికారులను నిలదీశారు. జమదాల ఆదమ్మకు కూడా ఇప్పటికీ బిల్లు చెల్లించలేదని టీడీపీ వైస్ ఎంపీపీ సింగిరెడ్డి భాస్కరరావు అధికారులను నిలదీశారు. గడిచిన మూడేళ్లలో సచివాలయ భవనాలు కట్టిన కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వలేదని... వారు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఉందన్నారు. కరెంటు బిల్లులు చెల్లించకపోతే పంచాయతీలలో వీధిలైట్లతో పాటు రక్షిత మంచినీటి పథకాలు ఆగిపోతున్నాయని విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బాడంగి సర్పంచ్ కండి రమేష్ మండిపడ్డారు. సగం సమాచారంతో అధికారులు వచ్చి సభ్యులకు తెలియజేయకపోవడం ఎంపీటీసీలను అగౌరవపరచడమేనని వైస్ ఎంపీపీ సింగిరెడ్డి భాస్కరరావు అధికారుల తీరును ఎండగట్టారు. ఈ సమావేశంలో ఎంపీడీవో ఆంజనేయులు, జెడ్పీటీసీ రామారావు, ఏఎస్ఐ కొండలరావు, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన బలమైన వర్గం

పార్వతీపురం ఆంధ్రజ్యోతి: జిల్లా కేంద్రంలో బలమైన వర్గంగా వైసీపీలో గుర్తింపు పొందిన దివంగత మాజీ మంత్రి చీకటి పరుశురాంనాయుడు కుమారులు టీడీపీలో చేరారు. శుక్రవారం రాత్రి బొబ్బిలిలో మాజీ మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు ఆధ్వర్యంలో చీకటి బద్రీనారాయణ, మాజీ మండల వ్యవసాయ శాఖ అధికారి చీకటి సింగ్, చీకటి బాల, ఈదుబిల్లి మురళి తదితరులు తమ వర్గాలతో టీడీపీలోకి చేరారు. పార్వతీపురం కూటమి అభ్యర్థి బోనెల విజయ చంద్ర సమక్షంలో చేరికలు జరిగాయి. ఈ కార్యక్రమంలో బార్నాల సీతారాం, మజ్జి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడిన ప్రాంతంగా ఉత్తరాంధ్ర

గుమ్మలక్ష్మీపురం: దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడిచినా ఉత్తరాంధ్ర అత్యంత వెనుకబడిన ప్రాంతంగా మిగిలిపోయిందని ఉత్తరాంధ్ర సాధన కమిటీ నాయకులు వేమిరెడ్డి లక్షుంనాయుడు, మార్పు ధనుంజయ నాయుడు అన్నారు. వారు శుక్రవారం గుమ్మలక్ష్మీంపురం వచ్చిన సందర్భంగా విలేకర్లతో మాట్లాడారు. ప్రస్తుతం పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఉత్తరాంధ్రలో వనరులు పుష్కలంగా ఉన్నా వాటిని సద్వినియోగం చేసుకోలేకపోతున్నామని అన్నారు. ఉత్తరాంధ్ర సాధన సమితిని బలపరిచి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించేవరకు అలుపెరుగని పోరాటం చేద్దామని, ప్రజలంతా భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు.


మాట్లాడుతున్న యూఎస్ఎస్ నాయకులు

ఉత్సవ విగ్రహాల ప్రతిష్ఠ


గ్రామ ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

గరుగుబిల్లి: కొంకడివరం పంచాయతీ సీతారాంపురం గ్రామంలో శ్రీసీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహాలు, కల్పవృక్షం పునః నిర్మాణ ప్రతిష్ఠా మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం ఉదయం ప్రతిష్ఠా కార్యక్రమం వైభవంగా నిర్వహించనున్నారు.

రాములోరికి విశేష పూజలు

సాలూరు రూరల్: శ్రీరామ నవ వసంత రాత్రి ఉత్సవాలు సందర్భంగా సాలూరు డబ్బీవీధి రామమందిరం వద్ద శుక్రవారం సీతారాములకు విశేష పూజలను నిర్వహించారు. పెదకోమటిపేట రామాలయంలో కుంకుమ పూజలు చేశారు. మెంటాడ వీధి, వేంకటేశ్వర కాలనీ, వెలమపేట, నెయ్యిల వీధి తదితర రామమందిరాల వద్ద విశేష పూజలను నిర్వహించారు.


పూజలు చేస్తున్న దృశ్యం

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

మక్కువ: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని ఎస్ఐ పి.నరసింహమూర్తి కోరారు. మండలంలోని కోన, గోపాలపురం, దబ్బగడ్డ గ్రామాల్లో ప్రజలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడతూ గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ప్రజలు వ్యవహరించాలన్నారు. అనవసర కేసుల్లో ఇరుక్కొని భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్‌లో సత్తాచాటారు

సీతంపేట: ఇంటర్ ఫలితాల్లో మల్లి గ్రామంలోని సీవోఈ (కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్) గురుకుల కళాశాలకు చెందిన 60మంది విద్యార్థులు సత్తా చాటినట్టు ప్రిన్సిపాల్ బెండి మురళీబాబు శుక్రవారం తెలిపారు. ఇంటర్ ఎంపీసీ ద్వితీయ సంవత్సరంలో 30 మంది విద్యార్థులు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. వీరిలో సవర సుజాత 959, నిరమ్మల హర్షవర్ధన్ 959, కొత్తూరు ఉపేంద్ర 946 మార్కులు సాధించారు. వీటితో పాటు 900 మార్కులు పైబడిన విద్యార్థులు 11 మంది, 800 మార్కులు పైబడిన విద్యార్థులు 12 మంది, మిగిలిన ఏడుగురు 758 మార్కులు సాధించడం పట్ల జిల్లా గిరిజన సంక్షేమశాఖ డీడీ అన్నదొర విద్యార్థులకు అభినందించారు. అదేవిధంగా సీతంపేట బాలికల గురుకుల కళాశాల మొదటి సంవత్సరం 166 మంది పరీక్షలకు హాజరు కాగా, 162 మంది విద్యార్థులు ప్రతిభ చూపారు. బాలుర గురుకుల కళాశాలకు చెందిన 158 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 133 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం మూడు కళాశాలలకు చెందిన 364 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, 355 మంది ఉత్తీర్ణత సాధించారు. గిరిజన విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడం పట్ల ఐటీడీఏ పీవో కల్పనాకుమారి విద్యార్థులను అభినందించారు. **వీరఘట్టం:** ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో రేగులపాడు కేజీబీవీకి చెందిన ఎస్.కీర్తన 470 మార్కులకు 446 మార్కులు సాధించింది. వీరఘట్టం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం ఎంపీసీలో ఝాన్సీ 456 మార్కులు సాధించింది. రెండో సంవత్సరం ఎంపీసీలో కె.ఆశ వెయ్యి మార్కులకు 930, ఫస్ట్ ఇయర్ బైపీసీకి చెందిన పి.పూజిత 440 మార్కులకు 350, రెండో సంవత్సరం బైపీసీకి చెందిన పి.భార్గవి 916 మార్కులు సాధించారు. **జియ్యమ్మవలస:** చినమేరంగి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్మీడియట్ ఫలితాల్లో మెరుగైన ప్రతిభ కనపర్చినట్టు ప్రిన్సిపాల్ ఎస్.రవణ సంతోషం వ్యక్తం చేశారు. మొదటి సంవత్సరం ఇంటర్‌లో ఎంపీసీలో 17 మందికి 17 మంది పాసయ్యారు. బైపీసీలో 21 మందికి 20 మంది, సీఈసీలో 12 మందికి 9 మంది, హెచ్ఈసీలో ఆరుగురికి ఆరుగురు పాసయ్యారు. ఇక ద్వితీయ సంవత్సరం పరీక్షా ఫలితాల్లో ఎంపీసీలో 16 మందికి 15 మంది, బైపీసీలో 32 మందికి 31 మంది, సీఈసీలో 19 మందికి 16 మంది, హెచ్ఈసీలో ఐదుగురికి నలుగురు ఉత్తీర్ణులయ్యారు. ప్రథమ సంవత్సరంలో 92.85 శాతం పాసవ్వగా, ద్వితీయ సంవత్సరంలో 91.66 శాతం పాసయ్యారు. ఎంపీసీలో 930 మార్కులతో బోను కుమారి కళాశాల ప్రథమ స్థానంలో నిలవగా, బైపీసీ నుంచి జ్యోతిర్మయి అనే విద్యార్థిని 900 మార్కులతో ఉత్తీర్ణత సాధించడం విశేషం.

ఆదర్శ పాఠశాలలో..


పావని(973), ఢిల్లీశ్వరి(936)

భామిని: ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షా ఫలితాల్లో భామిని ఆదర్శ పాఠశాలలో బైపీసీ దాసరి పావని 973 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది. అలాగే ద్వితీయ సంవత్సరం 108 మంది పరీక్షలు రాయగా 104 మంది ఉత్తీర్ణత సాధించి 96 శాతం సాధిచారు. మొదటి సంవత్సరం 99 మందికిగాను 79 మంది ఉత్తీర్ణత సాధించి 80 శాతం సాధించినట్టు పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.శివశంకర్ తెలిపారు. జూనియర్ కళాశాలలో రెండో సంవత్సరంలో 62 శాతం ఉత్తీర్ణులయ్యారు. మొదటి సంవత్సరంలో 96 మంది పరీక్షలు రాయగా 49 మంది ఉత్తీర్ణులైనట్టు పాఠశాల ప్రిన్సిపాల్ ఎర్రంనాయుడు తెలిపారు. అలాగే బీఆర్ అంబేద్కర్ గురుకులంలో ద్వితీయ సంవత్సరం 23 మంది గాను 22 మంది ఉత్తీర్ణత సాధించి మొదటి సంవత్సరం 24 మందికిగాను 21 మంది ఉత్తీర్ణులైనట్టు పాఠశాల ప్రిన్సిపాల్ విజయ నిర్మల తెలిపింది. అలాగే కేజీబీవీలో ద్వితీయ సంవత్సరం 25 మందికిగాను 19 మంది ఉత్తీర్ణత సాధించగా మొదటి సంవత్సరం 40మందికి 22 మంది పాసైనట్టు ఎస్‌వో భాగ్యవతి పేర్కొన్నారు. అయితే ఆదర్శ పాఠశాలలో రైతు కుటుంబం నుంచి వచ్చిన దాసరి పావని 973 మార్కులు సాధించారు. అలాగే చౌదరి ఢిల్లీశ్వరి 936 మార్కులు సాధించారు.

96 శాతం ఉత్తీర్ణత

కొమరాడ: ఇంటర్‌ఫలితాల్లో కొమరాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు 96 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ వై.నాగేశ్వరరావు తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 140 మందికి 134 మంది, ద్వితీయ సంవత్సరంలో 139 మందికి 133 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. బైపీసీ ద్వితీయ సంవత్సరంలో దత్తి అరుంధతి 929 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచారని అన్నారు.

పాచిపెంటలో..

పాచిపెంట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ ఇంటర్‌లో 80 మందికి 40 మంది ఉత్తీర్ణులు కాగా, ద్వితీయ ఏడాదికిగాను 93 మందికి 68 మంది ఉత్తీర్ణులై 73 శాతం సాధించారు. పి.కోనవలస బాలికల కళాశాలలో 75 శాతం ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరానికిగాను 121 మందికి 94 మంది ఉత్తీర్ణులై 77 శాతం సాధించారు. వీరిలో ప్రథమ ఇంటర్‌లో ఎస్.నందిని 458, టి.లక్ష్మి 437, సీహెచ్ ఇంద్రాణి 414 మార్కులు సాధించారు. అలాగే కేజీబీవీలో ప్రథమ సంవత్సరం పరీక్షల్లో 33 మందికిగాను 24మంది ఉత్తీర్ణులై 72 శాతం సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 20 మందికి 17 మంది ఉత్తీర్ణులై 85 శాతం సాధించారు. ప్రథమ ఎంపీహెచ్‌డబ్ల్యూలో ఎస్.మల్లేశ్వరి 442 మార్కులు సాధించింది. ద్వితీయ ఎంపీహెచ్‌డబ్ల్యూలో బి.నీలావతి 806 మార్కులు సాధించింది.

పాలకొండ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల..

పాలకొండ: స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫలితాల్లో విద్యార్థినులు సత్తా చాటారు. ద్వితీయ సంవత్సరం నుంచి 142 మంది పరీక్షలు రాయగా 80 మంది ఉత్తీర్ణత సాధించారు. 56.34 శాతం ఫలితాలు వచ్చాయి. ప్రథమ సంవత్సరంలో 26 శాతం ఉత్తీర్ణత నమోదైంది. వృత్తివిద్యా కోర్సులో ప్రథమ ఏడాది 77.05 శాతం, ద్వితీయ ఏడాది 84 శాతం ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ బైపీసీలో ఎస్.సుమిత్ర 878 మార్కులు, హెచ్ఈసీలో సవర సుభాషిణి 870 మార్కులు, ఎంపీసీలో పి.ప్రమీల 845 మార్కులు, ఎంపీహెచ్‌డబ్ల్యూవోలో కె.రమణి, కె.మంజులు 890 మార్కులు సాధించారు. ప్రథమ ఎంపీహెచ్‌డబ్ల్యూ నుంచి కె.స్వర్ణలత, 427 మార్కులు, ఎంఎల్‌టి నుంచి బి.పావని 413 మార్కులు, ఎంపీసీ నుంచి సవర మధులత 404 మార్కులు, బైపీసీ నుంచి ఆరిక పుష్ప 390, హెచ్ఈసీ నుంచి జడ్డు సుప్రజ 354, సీఈసీ నుంచి సవర దీపిక 344 మార్కులు సాధించారు.

కురుపాం కేజీబీవీలో..


లక్ష్మీప్రసన్న (962)

కురుపాం: స్థానిక కేజీబీవీలో విద్యార్థులు ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించగా, మొదటి సంవత్సరం పరీక్షల్లో 97.36 శాతం సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విద్యార్థిని అక్కినేని లక్ష్మీప్రసన్న 962 మార్కులు సాధించింది. అలాగే స్థానిక ఆదర్శ పాఠశాలలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 97 శాతం ఉత్తీర్ణత సాధించగా, మొదటి సంవత్సరం విద్యార్థులు 96 శాతం ఉత్తీర్ణత పొందారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 92.5 శాతం, ఒకేషనల్ విద్యార్థులు 92.2 శాతం ఉత్తీర్ణత సాధించగా, మొదటి సంవత్సరం విద్యార్థులు 75.7 శాతం, ఒకేషనల్ విద్యార్థులు 80 శాతం ఉత్తీర్ణత సాధించారు.

మక్కువ కళాశాల విద్యార్థులు..


శాంతికుమారి (428) కె.వాసంతి (944)

మక్కువ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం పరీక్షలకు 155 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 144 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ ఏడాది పరీక్షకు 151 మంది హాజరుకాగా 143 మంది ఉత్తీర్ణత సాధించారు. ములక్యాయవలస ఆదర్శ పాఠశాలలో ప్రథమ సంవత్సరం పరీక్షలకు 53 మందికిగాను 52 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ ఏడాది 77 మందికిగాను 77మంది ఉత్తీర్ణత సాధించారు. కాశీపట్నం కేజీబీవీలో ప్రథమ సంవత్సరం బైపీసీలో ఆర్.శాంతకుమారి 440 మార్కులకు 428 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. ద్వితీయ సంవత్సరం బైపీసీ విభాగంలో కేజీబీవీకి చెందిన కె.వాసంతి వెయ్యి మార్కులకు 944 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది.

ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలురు)లో...

స్థానిక ప్రభుత్వ జూనియర్‌కళాశాల బాలురులో ద్వితీయ సంవత్సరం ఇంటర్ ఫలితాల్లో 145 మంది విద్యార్థులకు 8 మంది ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ కోర్సులో 76 మంది విద్యార్థులకు 60 మంది ఉత్తర్ణత సాధించారు. మొత్తంగా 221 మంది పరీక్షలు రాయగా 140 మంది ఉత్తీర్ణత సాధించారు. అడ్డాకుల సందీప్ వెయ్యి మార్కులకు 964 మార్కులు సాధించారు. బూరాడ అనూష 918 మార్కులు సాధించారు. ఆర్ట్స్‌లో మామిడి చంద్రకళ వెయ్యి మార్కులకు 860 మార్కులు సాధించారు.

భద్రగిరి గురుకుల కళాశాలలో 97.5 శాతం ఉత్తీర్ణత

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని భద్రగిరి గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం 97.5 శాతం ఫలితాలు వచ్చాయి. ఇంటర్ మొదటి సంవత్సరంలో 120 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 117 మంది విద్యార్థులు పాస్ అయ్యారు. రెండో సంవత్సరంలో 95 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 91 మంది విద్యార్థులు పాసయ్యారు.

అత్యధిక మార్కులు సాధించిన గాయత్రి

గుమ్మలక్ష్మీపురం గిరిజన జూనియర్ ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం బైపీసీ చదువుతున్న జి.గాయత్రి 925 మార్కులు సాధించి, టాపర్‌గా నిలిచింది.


గాయత్రి

రాబోయేది కూటమి ప్రభుత్వమే

● సాలూరు ఎమ్మెల్యే అభ్యర్థి సంధ్యారాణి


పెద్దబజారులో ప్రచారం చేస్తున్న సంధ్యారాణి

సాలూరు: రానున్నది చంద్రన్న ప్రభుత్వమేనని కూటమి అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. పట్టణంలోని పెద్దబజారులో ఆమె శుక్రవారం ప్రచారం నిర్వహించారు. చిరు వ్యాపారులు, వర్తకులు పెద్దసంఖ్యలో ఆమె వద్దకు వచ్చి, ఈ ఐదేళ్లలో వారు పడిన ఇబ్బందులను వివరించారు. రానున్నది కూటమి ప్రభుత్వమేనని, చంద్రన్న పాలనలో అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని ఆమె వారికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్పీ భంజ్‌దేవ్, పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, కేతిరెడ్డి చంద్రశేఖర్, కూనిశెట్టి భీమారావు, గంట అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు. **సాలూరు రూరల్:** గ్రామాలన్నీ టీడీపీ వైపే చూస్తున్నాయని కూటమి అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. ముచ్చర్లవలసలో ఆమె శుక్రవారం ప్రచారం నిర్వహించారు. గ్రామంలో 150 మంది వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చినట్టు ఆమె చెప్పారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఆముదాల పరమేశు, తదితరులు పాల్గొన్నారు.

అధిష్ఠానం బలపరిచిన అభ్యర్థికే మద్దతు

సాలూరు: కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం బలపరిచిన అభ్యర్థిని గెలిపించటమే ప్రధాన ధ్యేయమని పార్టీ జిల్లా అధ్యక్షుడు నిమ్మక సింహాచలం స్పష్టం చేశారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో సమావేశం నిర్వహించి, మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం నలుగురు ప్రయత్నించగా, అందులో అధిష్ఠానం మువ్వల పుష్పరావును అభ్యర్థిగా ప్రకటించిందని చెప్పారు. ఆయన గెలుపు కోసం కృషి చేస్తామని తెలిపారు. అభ్యర్థి పుష్పారావు మాట్లాడుతూ ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పి తనను ఆదిరించాలని కోరారు.

జగన్ జైలుకు వెళ్లడం ఖాయం: జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం: రానున్న రోజుల్లో సీఎం జగన్ జైలుకు వెళ్లడం ఖాయమని కూటమి కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి తోయక జగదీశ్వరి అన్నారు. ఆమె శుక్రవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. వైన్ కుంభకోణంలో ఆయన హస్తం ఉందనే విషయం బట్టబయలు కాబోతుందన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ ఇంటికెళ్లడం ఖాయమన్నారు. ఈ సమావేశంలో జనసేన సమన్వయకర్త మల్లేశ్వరరావు, గుమ్మలక్ష్మీపురం, బీజేపీ కురుపాం మండల కన్వీనర్లు దివాకర్, ఊయక ఆనందరావు, టీడీపీ మండల అధ్యక్షుడు పాడి సుదర్శనరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జగదీశ్వరి

కూటమి అభ్యర్థి జయకృష్ణ ప్రచారం

సీతంపేట: గ్లాసు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కూటమి పాలకొండ ఎమ్మెల్యే అభ్యర్థి నిమ్మక జయకృష్ణ కోరారు. శుక్రవారం మండలంలోని చిన్నబర్న, కీసరజోడు పంచాయతీలో ఆయన ప్రచారం చేశారు. ఈ ప్రచారంలో కూటమి నాయకులు సవర తోటముఖలింగం, వెన్నపు శ్రీను, ఆరిక అమల, బిడ్డిక విశ్వనాథం, ఆర్.రంగనాథం, సంధ్యారాణి, హిమరిక పవన్ పాల్గొన్నారు. **పాలకొండ:** రానున్న ఎన్నికల్లో జనసేన పాలకొండ ఎమ్మెల్యే అభ్యర్థి నిమ్మక జయకృష్ణకు గ్లాసు గుర్తుపై ఓటువేసి గెలిపించాలని కూటమి నాయకులు కోరారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు గంటా సంతోష్ ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలపై వివరించారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.


జయకృష్ణకు తిలకం దిద్దుతున్న మహిళ

గెలుపే లక్ష్యంగా కృషి చేయాలి

గరుగుబిల్లి: కూటమి అభ్యర్థుల గెలుపే ధ్యేయంగా కృషి చేయాలని టీడీపీ ప్రతినిధులు మర్రాపు పురుషోత్తంనాయుడు, పొట్నూరు వెంకటనాయుడులు సూచించారు. శుక్రవారం చిలకాంలో అరకు టీడీపీ బీసీ సెల్ అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి సత్యనారాయణ నివాసంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వీరు మాట్లాడుతూ సమన్వయంతో ఎమ్మెల్యే అభ్యర్థి తోయక జగదీశ్వరి, ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీతలు విజయానికి కృషి చేయాలన్నారు. పార్టీ ప్రతినిధులు మరడాన తవిటినాయుడు, కోట భరత్‌కుమార్, అంబటి రాంబాబు, పి.పూర్ణచంద్రరావు, కండే బలరాంనాయుడు, జి.నాగరాజు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: విజయచంద్ర


ప్రచారంలో భాగంగా కోలాటం ఆడుతున్న విజయచంద్ర

సీతానగరం: కృష్ణరాయపురం గ్రామంలో కూటమి అభ్యర్థి బోనెల విజయచంద్ర శుక్రవారం ప్రచారం నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు పెంట సత్యంనాయుడు, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌నాయుడు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్ర పటాన్ని భుజం మీద పెట్టుకుని సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. పూడి శ్రీరాం, తాతబాబు, పరశినాయుడు శ్రీను సమక్షంలో 40 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. ఈ కార్యక్రమంలో గొట్టాపు వెంకటినాయుడు, బార్నల సీతారాం, అక్కెన ఎల్లంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గోర్జిపాడులో ప్రచారం

కురుపాం రూరల్: మొండెంఖల్ పంచాయతీ గోర్జిపాడులో టీడీపీ నాయకులు శుక్రవారం ఇంటింటి ప్రచారం చేశారు. మాజీ జడ్పీ కోఆప్షన్ సభ్యుడు రంజిత్‌కుమార్ నాయికో, బెహరా వేంకటేశ్వర్లు, పొందర బలరాంతో కూడిన బృందం ఇంటింట తిరుగుతూ కూటమి అభ్యర్థి తోయిక జగదీశ్వరికి ఓటు వేయాలని అభ్యర్థించారు.

క్లుప్తంగా..

రేపు మూడు మండలాలకు పవర్ కట్

జియ్యమ్మవలస: కురుపాం నియోజకవర్గ పరిధిలోని జియ్యమ్మవలస, కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో ఈనెల 14న విద్యుత్ పవర్ కట్ ఉంటుందని జియ్యమ్మవలస మండల విద్యాశాఖ ఏఈఈ బడే శ్రీనివాసనాయుడు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పవర్ కట్ ఉంటుందని చెప్పారు. చెట్టు కొమ్మల తొలగింపు, నిర్వహణ పనుల కారణంగా విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని తెలిపారు. దీని ప్రభావంతో కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాలకు ఆయా సమయాల్లో పవర్ కట్ కొనసాగుతుందన్నారు.

నేడు గరుగుబిల్లిలో..

గరుగుబిల్లి: గరుగుబిల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ 33 కేవీ లైన్ పరిధిలోని చెట్లు కొమ్మలు తొలగించనున్న నేపథ్యంలో శనివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నామని మండల విద్యుత్‌శాఖ ఏఈ బి.శంకరరావు తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని మరుపెంట, గొట్టివలస, గొల్లవానివలస, తులసిరామినాయుడువలస, చినుగడబ గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలి

మక్కువ: మునక్కాయవలస ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశాలకు ఈనెల 21న నిర్వహించే అర్హత పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు సంబంధిత వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.స్వర్ణలత కోరారు. సంబంధిత విషయాన్ని దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు, తల్లిదండ్రులు గమనించాలని సూచించారు.

కురుపాం అభ్యర్థిగా రమణ

గుమ్మలక్ష్మీపురం: కాంగ్రెస్‌తో పొత్తులో భాగంగా కురుపాం ఎస్టీ అసెంబ్లీ అభ్యర్థిగా సీపీఎంకు చెందిన మండంగి రమణను ఎంపిక చేశారు. ఇదిలా ఉండగా ఎంపీ సీటు కూడా సీపీఎంకు చెందిన వ్యక్తికి కేటాయించినట్టు తెలిపారు.

చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయండి

● రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి కోండ్రు

రాజాం: పట్టణంలోని అంబేద్కర్ కూడలి వద్ద ఈనెల 15న టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్ర బాబు రోడ్‌షో నిర్వహిస్తారని... ప్రజలు భారీగా హాజరై విజయవంతం చేయాలని కూటమి అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ కోరారు. శుక్రవారం సంతకవిటి మండలం మామిడిపల్లి గ్రామంలో కొళ్ల అప్పలనాయుడు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేసి ప్రజలు హాజరయ్యేందుకు ప్రయత్నించాలని కోండ్రు కోరారు. అనంతరం వాసుదేవప ట్నానికి చెందిన 50 వైసీపీ కుంటుంబాలు టీడీపీలో చేరాయి. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు బొత్స వాసుదేవరావునాయుడు, గట్టి భాను, మొయ్యి నారా యణప్పడు, బొడ్డేపల్లి సూర్యనారాయణ, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

● **వంగర:** టీడీపీ అధినేత చంద్రబాబు రాజాంలో ఈనెల 15న రోడ్ షో నిర్వహించనున్నారని మాజీ మంత్రి కోండ్రు మురళీమోహన్ తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో శుక్రవారం వంగరలో సన్నాహక సమావేశం నిర్వహించారు. అనంతరం మద్దివలసలో జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబు అధికారంలోకి వస్తేనే మార్పు: కోళ్ల

శృంగవరపు కోట: సీఎంగా చంద్రబాబు అధికారంలోకి వస్తేనే యువత జీవితాల్లో మార్పు వస్తుంద టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. శుక్రవారం శృంగవరపుకోట బర్మాకాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఇందుకూరి సుధారాణి, సర్పంచ్ గనివాడ సంతోషి కుమారి, నాయకులు జీఎస్‌నాయుడు, రెడ్డి వెంకన్న, కొణదం మల్లేశ్వరరావు, నానిగిరి రమణాజీ, కాపుగంటి శ్రీనివాసరావు, పొట్నూరు సాయిరాం, చెక్క కిరణ్ కుమార్, పెదగాడి రాజు తదితరులు పాల్గొన్నారు.

బేబీనాయన ఇంటింటి ప్రచారం

బొబ్బిలి: టీడీపీ, జనసేన బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్‌వీఎస్‌కేకే రంగారావు (బేబీనాయన) శుక్రవారం పాతబొబ్బిలి 1, 2 వార్డులలో ఇంటింటి ప్రచారం చేశారు. ప్రసాద్‌నగర్ కాలనీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని మహిళలు ఆయనకు చెప్పారు. చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని... అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని హామీ ఇచ్చారు. ఆయన వెంట రెండు వార్డుల ఇన్‌చార్జిలు, పార్టీ పట్టణ అధ్యక్షుడు రాంబార్కి శరత్‌బాబు, జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు

గొంగాడవలస, అన్నం నాయుడువలస గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ జి.శ్రీనివాసరావు, కొట్నాన శ్రీను, గుల్ల లక్ష్మణ ఆధ్వర్యంలో వంద కుటుంబాలు శుక్రవారం బొబ్బిలి కోటలో బేబీనాయన సమక్షంలో టీడీపీలో చేరాయి. కలవరాయి, వాకాడ వలస గ్రామాలకు చెందిన వైసీపీ మాజీ సర్పంచ్ పాటూరి కృష్ణమూర్తి, వాకాడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సుమారు 60 కుటుంబాలవారు వైసీపీని వీడి బేబీనాయన సమక్షంలో టీడీపీలో చేరారు. మెట్టవలసలో శుక్రవారం రాత్రి వైసీపీ కార్యకర్తలు పెద్దసంఖ్యలో టీడీపీ చేరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వాసిరెడ్డి సత్యనారాయణ, సీనియర్ నేత అల్లాడ భాస్కరరావు పాల్గొన్నారు.

నెల్లిమర్ల నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా

● కూటమి అభ్యర్థి లోకం మాధవి

నెల్లిమర్ల: ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే నెల్లిమర్ల నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందుంచుతానని కూటమి అభ్యర్థి లోకం నాగమాధవి అన్నారు. మండలంలోని దన్నానపేట, సీతారామునిపేట, గొర్లెపేట, ఎటి అగ్రహారం, కొత్తపేట గ్రామాల్లో శుక్రవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా టీడీపీ, జనసేన నాయకులతో అయా గ్రామాల్లోని ఉపాధి హామీ కూలీలను కలిశారు. మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. రానున్న ఎన్నికల్లో గ్లాసు గుర్తుపై ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు, పార్టీ మండల అధ్యక్షుడు కడగల ఆనంద్‌కుమార్, జిల్లా మహిళా అధ్యక్షురాలు సువ్వాడ వనజాక్షి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఒడిశా

రావి, తులసి చెట్లకు వివాహం


వివాహం జరిపేందుకు వస్తున్న వీరబాబు దంపతులు

రాయగడ: స్థానిక ప్రేమ పహడ్ వద్ద ప్రముఖ వ్యాపారవేత్త శ్రవణం వీరబాబు దంపతులు శుక్రవారం విష్ణురూపానికి ప్రతీక అయన రావి చెట్టుకు, లక్ష్మీస్వరూపిణి తులసి చెట్టుకు వివాహం జరిపించారు. వీరబాబు పది సంవత్సరాల క్రితం ప్రేమపహడ్ వద్ద నాటిన రావిమొక్క మహావృక్షంగా ఎదిగింది. దీంతో వారి ఇంటి నుంచి ఊరేగింపుగా తులసి చెట్టును తీసుకుని వచ్చి రావిచెట్టుతో వివాహం జరిపించారు. హోమక్రతువు నిర్వహించారు. లయన్స్ క్లబ్ సభ్యులు సహకరించారు.

అప్పలస్వామికే కాంగ్రెస్ అభయాస్తం

రాయగడ: అందరూ అనుకున్నట్లే ఆదివాసీ మహాసంఘం అధ్యక్షుడు, సీనియర్ కాంగ్రెస్ నేత అప్పలస్వామి కద్రకను కాంగ్రెస్ అధిష్ఠానం రాయగడ శాసనసభ నియోజకవర్గ అభ్యర్థిగా ప్రకటించింది. ఈ విషయం తెలిసిన వెంటనే ఆయన అభిమానులు, కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు.

బిషుబో వేడుకలు

రాయగడ: ఒడియా సోదరుల కొత్త సంవత్సరాది బిశ్వసంక్రాంతి సందర్భంగా రాయగడ బిషుబో బందుమిలన్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ నిరంజన్ బక్షిపాత్ర అధ్యక్షతన పలు పోటీలకు శ్రీకారం చుట్టారు. పోటీలకు రాయగడ టౌన్‌హాలు వేదిక అయ్యింది. పిల్లలకు చిత్రలేఖన పోటీలు, మహిళలకు అలంకరణ పోటీలు నిర్వహించారు. రంగవల్లుల పోటీలు, సంప్రదాయ దుస్తుల పోటీలు నిర్వహించారు. న్యాయ నిర్ణేతలుగా మంజుల మినియక, నమిత పాడిలు వ్యవహరించారు.

ఎన్నికల ప్రదర్శన కేంద్రం ప్రారంభం

రాయగడ: గుణుపురం సమాచార్ కేంద్రం ఆవరణలో ఎన్నికల ప్రదర్శన కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మాహాజన్ రిబ్బను కత్తిరించి ప్రారంభించారు. గుణుపురం సబ్ కలెక్టర్ కిరణ్‌దీప్ కౌర్ గౌరవ అతిథిగా పాల్గొన్నారు. ఈ ప్రదర్శనలో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఇంతవరకు ఎన్నికలు ఎలా జరిగాయి అనే అన్ని విషయాలను ప్రదర్శనలో ఉంచారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్ మాఝి, అసిస్టెంట్ కలెక్టర్ సత్యజిత్ నాయక్ బిపిన్ చంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.


కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్